ఖమ్మం : గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఖమ్మం : సంక్రాంతి పిండి వంటలు చేస్తున్న బాలికలు

సంక్రాంతి సంబురం

ముంగిళ్లకే అందం తెచ్చిన రంగురంగుల ముగ్గులు
ఆకట్టుకున్న డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు
గాలిపటాలు ఎగురవేస్తూ యువకులు, చిన్నారుల సందడి
ఆలయాలు, ఇళ్లల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రజలు
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా సంక్రాంతి, కనుమ పండుగ

కరకగూడెం : రాయినిపేటలో ముగ్గుల పోటీల్లో మహిళలు

సత్తుపల్లి : గంగిరెద్దుకు దాణా తినిపిస్తున్న చిన్నారులు

అశ్వారావుపేట : ఇంటి ముందు రంగులతో వేసిన ముగ్గు

సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళలు, యువతులు తెల్లవారుజామునే వాకిళ్లలో పేడ నీళ్లు చల్లి ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేసి రంగురంగులతో తీర్చిదిద్దారు. ముగ్గు మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను పెట్టి వాటిపై నవధాన్యాలు పోసి పూజలు చేశారు. గుమ్మాలకు బంతిపూలు, మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ హరిదాసులు కీర్తనలు పాడుతూ.. డూడూ బసవన్నలు చేస్తున్న విన్యాసాలు పండుగ శోభను తెచ్చిపెట్టాయి. ఉదయమే కుటుంబ సమేతంగా నూతన వస్త్రాలు ధరించి ఆలయాలు, ఇళ్లల్లో పూజలు చేసి.. తర్వాత మహిళలు పిండి వంటల్లో నిమగ్నమయ్యారు. యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ భవనాలపైకి ఎక్కి రంగురంగుల గాలిపటాలు ఎగురవేస్తూ పొద్దంతా సందడి చేశారు. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో ఇంటింటా పండుగ సందడి నెలకొన్నది. నోరూరించే రుచికరమైన పిండివంటలు ఆరగించారు. మహిళలు సాయంత్రం పేరంటాలు నిర్వహించి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కనుమ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైతులు ప్రాధాన్యతగా భావించే పండుగ రోజు పశుపక్ష్యాదులకు పూజలు చేశారు. పాడిపంటలు, సిరిసంపదలు తెచ్చిపెట్టే పశువులకు ఈరోజు ఎలాంటి పని చెప్పకుండా భక్తిప్రపత్తులతో పూజించారు. ఉమ్మడి జిల్లాలోని గోశాలల్లో పశువులను అలంకరించి.. పసుపు, కుంకుమలతో గోపూజ చేశారు. ధనర్మాసోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో గోదారంగనాథుల స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

- ఖమ్మం, జనవరి 16 , నమస్తే నెట్‌వర్క్

ఖమ్మం : కోడి బొమ్మలతో పందేలు నిర్వహిస్తూ సందడి చేస్తున్న చిన్నారులు

ఖమ్మంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న మహిళలు

చండ్రుగొండ : ముగ్గుల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సురేష్

ఖమ్మంలో బొమ్మల కొలువు వద్ద చిన్నారులు

పతంగి ఎగురవేస్తున్న చిన్నారులు

అశ్వారావుపేట : మూడో రోజు కొనసాగిన కోడి పందేలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి అస్వస్థత

తమ్మినేని వీరభద్రం (ఫైల్)

ఖమ్మం, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖమ్మం జిల్లా రూరల్ మండల పరిధిలోని తన స్వగ్రామమైన తెల్దారుపల్లిలో సోమవారం అస్వస్థతకు గురయ్యారు. తెలిసిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన స్వగ్రామానికి విచ్చేశారు. మధ్యాహ్నం ఆయనకు ఉన్నట్టుండి చెమటలు పట్టాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడ్డారు. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆయన్ను ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయన్ను పరీక్షించి హార్ట్‌బీట్ తక్కువ సార్లు నమోదవుతున్నదని గుర్తించారు. అనంతరం కుటుంబసభ్యులు ఆయన్ను హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, పార్టీ నాయకులు, గ్రామస్తులు ఆందోళన చెందొద్దదని అక్కడి వైద్యులు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఆహ్వానం

వేముల కామేశ్వరరావు

భద్రాచలం, జనవరి 16 : జాతీయ స్థాయిలో అనేక ప్రజాహిత సేవా కార్యక్రమాలు నిర్వహించే ప్రథమ్ అనే స్వచ్ఛంద సంస్థ ఢిల్లీలో బుధవారం నిర్వహించే సర్వే రిపోర్ట్ విడుదల కార్యక్రమానికి హాజరుకావాలని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావుకు ఆహ్వానం పంపింది. పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కామేశ్వరరావు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పేద విద్యార్థుల చదువుకు తనవంతుగా సాయం అందిస్తున్నారు. కొవిడ్ సమయంలోనూ ఎందరో నిరుపేదలకు ఉచితంగా ఆహారం పంపిణీ చేశారు. కాగా.. ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ గత ఏడాది దేశవ్యాప్తంగా 14 ఏళ్లలోపు పిల్లలకు విద్య, వివిధ అంశాల స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే చేపట్టింది. ఆ సర్వే రిపోర్టును బుధవారం విడుదల చేస్తున్న సందర్భంగా కామేశ్వరరావుకు ఆహ్వానం పంపడంతోపాటు విమానయాన ఖర్చులను సైతం ఆ సంస్థ ప్రతినిధులు చెల్లించడం విశేషం.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కిన్నెరసాని విద్యార్థుల ఎంపిక

పాల్వంచ రూరల్, జనవరి 16: ఈ నెల 17 నుంచి 20 వరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) పోటీలకు 130 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి 6 వరకు కిన్నెరసానిలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. వారిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు 7 నుంచి 16 వరకు కిన్నెరసాని క్రీడాపాఠశాలలో శిక్షణ ఇచ్చారు. వారిలో 130 మంది బాలబాలికలను ఎంపిక చేశారు. క్రీడల్లో పాల్గొనేందుకు మంగళవారం క్రీడాకారులు ఉట్నూరు బయలుదేరి వెళ్లారు. వీరికి ఏటీడబ్ల్యూవో నరసింహారావు, క్రీడల అధికారి గోపాల్‌రావు, హెచ్ఎం చందూ వీడ్కోలు పలికారు.

జాలిముడి ప్రాజెక్ట్ రెండో దశ పనులకు సర్వే చేపట్టాలి

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

మధిర, జనవరి 16: వైరా మున్నేరుపై జాలిముడి ప్రాజెక్ట్ రెండో దశ పనులకు సర్వే ప్రక్రియ చేపట్టాలని, అదే విధంగా ఇదే ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కాలువలను ఆధునీకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మధిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రుపాలెం మండలంలోని కట్టలేరు ప్రాజెక్ట్ పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో టెండర్ల ప్రక్రియ పూర్తయి, పురోగతిలో ఉన్న పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. వీధి వ్యాపారుల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ట్యాంక్‌బండ్ రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలల భవనాలను రెసిడెన్షియల్ విద్యాలయాలకు కేటాయించాలన్నారు. స్నానాల లక్ష్మీపురం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కనెక్టివిటీ లేని అనుబంధ గ్రామాల్లో రోడ్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలో రూ.34 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వాసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తర్వాత పట్టణంలో రూ.2.66 కోట్లతో నిర్మించిన మినీస్టేడియాన్ని సందర్శించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలను సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, వైస్‌చైర్మన్ శీలం విద్యాలత, ఇరిగేషన్‌శాఖ సీఈ విద్యాసాగర్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.మాలతి, ఖమ్మం ఆర్డీవో జీ.గణేశ్, ఆరోగ్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి సుమన్‌చక్రవర్తి పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి..

వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించిన మంత్రి తుమ్మల

వ్యవసాయ శాఖ డైరెక్టర్‌తో పలు అంశాలపై సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 16 : రైతులకు నష్టం వాటిల్లే చర్యలు చేపట్టవద్దని, వారికి అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు ముందుగానే సమకూర్చాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. నిర్మల్ జిల్లాలో నమోదైన యూరియా కొరతకు సంబంధించిన సమస్యపై సమీక్షించారు. దీనిపై వ్యవసాయ సంచాలకులు వివరిస్తూ.. ఇటీవల జరిగిన లారీల సమ్మె కారణంగానే యూరియా కొరత ఏర్పడిందని, వారు సమ్మె నిలిపివేయడంతో సమస్య పరిష్కారమైందన్నారు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. అలాగే మిర్చి ధర, తెగుళ్ల నియంత్రణ, మార్కెట్‌లో ఇటీవల తలెత్తిన పలు అంశాలపై సమీక్షించారు. రైతుల ఆదాయం పెంచడం, పంటల్లో వైవిధ్యాన్ని పెంచడంపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. అధిక దిగుబడి పంటను ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు, అన్ని సంఘాల ప్రతినిధులతో వారి సమస్యలపై సమీక్ష నిర్వహించాలని వ్యవసాయ సంచాలకులను మంత్రి ఆదేశించారు.

రామయ్య సేవలో కేంద్ర మంత్రి వర్మ

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు

రామయ్యను దర్శించుకున్న కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీఎల్ వర్మ

భద్రాచలం, జనవరి 16 : భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీఎల్.వర్మ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వెండి బిందెలో తీసుకొచ్చిన అయోధ్య అక్షింతలకు, భగవద్రామానుజుల వారి విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీసీతారాముల వారి ప్రతిష్ఠా కార్యక్రమంలో ఈ అక్షింతలను వినియోగించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగా కిరణ్, ఎర్రంరాజు బెహరా, నిడదవోలు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' పరీక్షకు 19 కేంద్రాలు

20న ఎగ్జామ్.. 3,140 మందికి అడ్మిట్ కార్డులు

కూసుమంచి, జనవరి 16: కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న పరీక్ష జరుగనున్నది. పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 19 కేంద్రాలు సిద్ధమమవుతున్నాయి. ఉభయ జిల్లాల నుంచి పరీక్షకు 3,140 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట ఆధార్‌కార్డు, నివాస ధ్రువీకరణపత్రాలను తెచ్చుకోవాలని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి క్యాలిక్లేటర్, డిజిటల్ వాచ్‌ల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదన్నారు. విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యంతరాలు, అత్యవసర పరిస్థితులపై 77021 57196, 98484 02281లో సంప్రదించాలని సూచించారు.

పడిపోతున్న పాలేరు నీటి మట్టం

మరో 20 రోజులకే తాగునీరు

పాలేరు జలాశయం

కూసుమంచి, జనవరి 16: పాలేరు జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతూ వస్తున్నది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 13.5 అడుగులు. దీంతో తాగునీటి సరఫరాకూ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తున్నది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటితో మరో 20 రోజుల పాటు మిషన్ భగీరథకు నీరు అందించే పరిస్థితి నెలకొన్నది. ఆ తర్వాత డెడ్ స్టోరేజీ ఏర్పడనున్నది. అప్రమత్తమైన నీటిపారుదలశాఖ, మిషన్‌భగీరథ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. బయ్యన్న వాగు నుంచి గోదావరి జలాలు లేదా సాగర్ నుంచి ప్రత్యేకంగా పాలేరుకు జలాలు తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నారు. తాగునీటి అవసరాలపై ఇప్పటికే రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనేకసార్లు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపనున్నారు.

భద్రాద్రి రామయ్యకు రథోత్సవం

భద్రాచలం : రథోత్సవం సందర్భంగా రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు

భద్రాచలం, జనవరి16 : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత సాయంకాలపు ఆరాధన, రాజ దర్బార్ సేవ, యాగశాలలో రథాంగ హోమం, బలిహరణం, పూర్ణాహుతి జరిపారు. స్వామివారికి చక్కెర పొంగలిని నివేదించారు. రథంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి రాచ గుమ్మడికాయతో రథానికి దిష్టి తీశారు. ఆలయ అధికారులు రథాన్ని లాంఛనంగా లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, హారతులు, అరటిపళ్లు సమర్పించారు. రథసేవ ఆలయం నుంచి తాతగుడి సెంటర్ వద్ద ఉన్న గోవిందరాజుల స్వామివారి ఆలయం వరకు కొనసాగింది. పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్ దళాలతో బందోబస్తు నిర్వహించారు.

పర్ణశాల రామయ్యకు తిరువీధి సేవ

పర్ణశాల, జనవరి 16 : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఆలయంలో రామయ్యకు ఘనంగా తీరువీధి సేవ నిర్వహించారు. ఉదయం నుంచి మూలవిరాట్లకు నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ, తిరువారాధన, రథహోమం, రాధా అలంకారం, రథబలి, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథంపై వేంచేపు చేసి తిరువీధి సేవ నిర్వహించి ప్రధాన ద్వారం వద్ద ప్రళయ కలహోత్సవం కన్నుల పండువగా చేపట్టగా.. భక్తులు తిలకించారు. అనంతరం స్వామివారి నివేదన కార్యక్రమం నిర్వహించారు.